సప్తతి మహోత్సవం

మౌనంలోనూ, నిశ్శబ్దంలోనూ ఒక మహత్తర శక్తి దాగి వుంటుందని ఆయన సాహచర్యంలోనే నేను గ్రహించాను. మరి నాలుగేళ్లపైగా న్యాయవాద వృత్తిలో ఆయన జూనియర్‌గా ఎదిగిన వాణ్ణిగదా. న్యాయస్థానంలో ఏ వివాదంలో తర్జన భర్జనలు జరుగుతున్నా, ఆయన అనర్గళ వాక్ప్రవాహానికి ఒకటి రెండు నిమిషాల మౌనం తప్పనిసరి. ఏదో యోగ సమాధిలోకి జారిపోయినట్లుగా అనిశ్శబ్దం. ఆ తదుపరి వెలువడే మాటలు-ఒక ప్రవక్త పవిత్ర ప్రవచనంలాగా, ఒక మహాకవి అంతర్జ్వలనం అక్షరరూపం దాల్చినట్లుగా గంభీర వాతావరణాన్ని కోర్టులో నెలకొల్పటం స్వానుభూతి పరంపర.

నా అభ్యర్థనను ఆయన ససేమిరా అంగీకరించలేదు. రెండు మన్వంతరాల కాలవ్యవధి లాంటి మౌనం తర్వాత ఆయనన్నారు: అరవై ఏళ్లు గానుగెద్దులాగా జీవించినందుకు ఒక షష్టిపూర్తి ఉత్సవం, పాతికేళ్ళు న్యాయవాదిగా నెట్టుకొచ్చినందుకు ఒక సిల్వర్ జూబిలీ-వీటితో నాకు నమ్మకం లేదు- సరికదా అదొక అల్పమైన అహంభావమని నా భావన. అవి మహామనీషులకు మాత్రమే తేజో దీపాలుగా మనవంటి సామాన్యులం వెలగించవలసిన దివ్వెలు. కాలాయతస్మైనమః-అని ఒక ప్రార్థనాంతర్గత పాదం వున్నది - దాని అర్థం ఇది. దేనివల్లనైతే అన్ని శుష్కభోగాలూ స్మరణపథంలోంచి మాయమయ్యాయో ఆకాలానికి నా నమస్కారం - కృతజ్ఞతలు చెప్పుకోవలసింది కాలానికి. ఈ పండగల అల్ప ప్రజ్ఞకు కాదు".

మళ్లీ నిశ్శబ్దం. నేనిక సెలవు తీసుకొందామని నమస్కారంచేసి లేస్తుండగా మౌనభంగం చేస్తూ ఆయన వారించారు. "కూర్చో మూర్తీ! ఇందాక మహామనీషులన్నానే వారిని గూర్చి నీకు వినాలని లేదా?"

"ఎందుకులేదుసార్, మిమ్మల్ని విసిగించగూడదని లేచాను"

"అయితే విను. నీకొక సప్తతి ఉత్సవం గురించిన వుదంతం చెబుతాను"

గౌరీపతిగారి మాటలు గడచిపోయిన ఏ శతాబ్దపు చరిత్ర పుటలనుంచో సహజగంభీరతతో వెలువడుతున్నట్లనిపించి వినమ్రంగా కూర్చొన్నాను. యోగ

మాయనుండి మేల్కొన్న నిశ్శబ్ద దేవత తన మంచు పెదవులను విప్పి పవిత్రమంత్రోచ్చాటనను వినిపిస్తున్నప్పుడు, మానస సరోవరంనుండి కైలాస శిఖరంపైకి ఎగురుతున్న రాజహంస రెక్కల మార్మిక సంగీతం వినవస్తున్నప్పుడు-అర్ధరాత్రి అయితేనేం, అపరాత్రి అయితేనేం? బయట చలిగాలి.

"పరవాలేదు. నీ సిగిరెట్టు ముట్టించుకో"

"నేనా? మీముందా?"

"నా ముందే. మనం కలియుగంలో వున్నాం. కాని ఈ కథ ద్వాపరయుగం నాటిదిగా నీకు తోస్తుందేమో. అందుకని"!

❖ ❖ ❖

"ముప్పై ఏళ్ల తర్వాత మళ్ళీ మా వూరు వెళ్లాను. అప్పటికి నీవు ప్రయోజకుడివై మీ జిల్లాలో సొంత ప్రాక్టీసు ప్రారంభించావనుకొంటాను. ఎప్పటికప్పుడు ఏదో అవాంతరం ఎదురొచ్చి ఆగిపోయిన ప్రయాణం యిది. 'ఏదో అవాంతరం'-అని నెపం వెయ్యటం గూడా - నిజానికి ఒక పలాయనమంత్రం. నగర జీవితపు సాలెగూడు చిక్కుల్లో ఇరుక్కొని మనం జీవితగమనంలో ఏమికోల్పోతున్నామో గ్రహించలేము గదా!

చెన్నకేశవ స్వామి దేవాలయం ధర్మకర్తుత్వం తప్పిస్తే (అది గూడా ఒక పరోక్ష కార్యమే!) నాకూ స్వగ్రామానికి ఋణం తీరి దాదాపు అర్ధశతాబ్ది అవుతున్నది గదా-అక్కడి ఆవిశాల భవనం ఎవరికో ఒకరికి విక్రయించి పారేస్తే సరిపోతుంది గదా-అని మా వాళ్లు అంటుంటారు. దాని చుట్టూ వున్న అంటు మామిడి తోట మీద వచ్చే స్వల్పాదాయం నీ ఖర్చుల్లో ఏమూలకు? (ఒకసారి నీవు కూడా యీ ప్రశ్నవేసావని గుర్తు. నేనేం జాబిచ్చానో స్మృతిలో లేదు) జన్మభూమితో ఋణం తీరిందనటం-కృతఘ్నులకే చెల్లుతుంది. తప్పిపోయిన పశువులుగూడా తమ గాటను పసిగట్టి ఆ యింటికే వస్తాయి-అని నేను సమాధానం చెబుతుంటాను. ఏమిటంత సెంటిమెంటల్‌గా ఆలోచిస్తున్నాడని అందరూ అనుకోవచ్చు.

ఒక్క బాల్యానందం, పితరుల సమాధులు, వాగులు, చెరువులు, గుళ్లగోపురాలు, ఆనాటి మిత్రబృందం-ఇవేకాదు, ఒక అలౌకికమైన అభౌతికమైన చిదానందం ఒక రంగురంగుల కేతనంగా, ప్రాచీన సంగీత రాగంగా, జనని మృదుల హస్త స్పర్శగా, జీవన మూల్యాల నొత్తి పలికే ప్రాణశంఖంగా నాకు స్వప్నదర్శన మిస్తుంటుంది మావూరు. మా పెద్దల ఆధ్యాత్మిక ఐహిక సంపదకు ప్రతీకగా మాస్వగృహం. ఏమో, నా సంతతిలో ఎవరికైనా ఈ దుష్ట అమానవీయ సంస్కృతి అభద్రతనుండి దూరం పోవాలనిపించినప్పుడు-ఆ ఇల్లు ఆహ్వానించదా?

ఇంతకూ విచిత్రమేమిటంటే-ఆ ప్రయాణానికి నాందీ, ప్రేరణా, సంకల్పం - ఒక కల. ఒక స్వప్న సంచలనం!

మే నెలలో న్యాయస్థానాలకు వేసంగి సెలవులు గనక, సారస్వత సభలు ఏర్పాటు చేయాలని కొందరు సాహిత్యాభిలాషులు మా ఇంట్లో ఒక సన్నాహక కమిటీని సమావేశపరిచారు. ఆతిథ్యం మాది. కాని అది పుట్టకముందే మరణించే అనేక ఆంధ్రోద్యమాలవంటి శిశువుగా మారింది. మైక్ దొరికితే చాలు పెద్ద ఉపన్యాసాలు, నీతులు ఆశయాలు విసిరే ఆ మనుషుల్లో కుళ్లు మొదటి సారిగా ప్రత్యక్షంగా చూచాను. మామూలు కుళ్లు కాదు- కులం కుళ్ళు. ప్రాంతీయాభిమానం కుళ్లు. వర్గ వర్ణ విభజనల కుళ్లు. ఆత్మవిధ్వంసకుల విసుర్లు, పరస్పరారోపణలు తిట్లు, తిమ్మెలలమధ్య ఆ క్షణంలోనే ఆ కమిటీ రద్దయింది. ఈ గొడవతో ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు.

తెల్లవారు జామున కల ఒక దీర్ఘ చిత్త విభ్రంగా నన్ను వెంటాడింది. మా గ్రామ చెన్నకేశవ స్వామి కోవెల ధ్వజస్థంభం కదలి నన్ను వెతుకుతూ వస్తున్నదట. ఏమిటీ వైపరీత్యం? చెన్నకేశవుడికి ఎవరు తలపెట్టారు-ఒక అమంగళాపచారం? స్థల పురాణాల్లో చాళుక్యుల శాసనాల్లో, శతకగ్రంథ కర్తల నిష్కామభక్తి పదాల్లో వరప్రసాదుడుగా వినుతికెక్కిన స్వామి ఈ రాయబారం ఎందుకు పంపుతున్నాడు? ముస్లిం విధ్వంసకుల దండయాత్రల్లో రెండుసార్లు శిథిలమైనా మళ్లీ ప్రాచీనవైభవంతో తలెత్తినవాడుగదా. క్షేత్రపాలకుడై ఆ తర్వాత వెలసిన ఆంజనేయులు తన ధర్మాన్ని విస్మరించాడా? కమ్ముకొస్తున్న కాలమేఘాల లాంటి ఆందోళనలు, సంకీర్ణ సంక్షుభిత అరణ్యమైన హృదయం-ఇది సాధారణమైన స్వప్నం కాదు. నా ధర్మపత్ని అంటున్నది 'ఎందుకంత క్షోభపడ్తారు? ఒకసారి వెళ్లొస్తేపోలా? పిల్లలు గూడా బియ్యపు చెట్లు చూడాలని వుబలాటపడ్తున్నారు". పిల్లలది కాన్వెంటు చదువుల సంస్కారం. వాళ్లు మావూరు చూడలేదింతవరకూ. నా భార్య మా వివాహం తర్వాత గృహప్రవేశం నాడే చూచింది. చెన్నకేశవుడితో ఆమెకు పరిచయం లేదు.

రిపేరీలో వున్న కారు గారేజీ నుంచి తిరిగి వచ్చింది. రాత్రికి పయనం. ఒంటరిగానే. ఆ మధ్యాహ్నం టపాలో రెండు జాబులు వచ్చాయి. నా దుస్వప్న సంకేతాలకు టిప్పణి లభించినట్లయింది.

❖ ❖ ❖

మేమంతా అన్నగారు అని సంభోదించే మా దూరపు దాయాదులు సీతారాంగారి ఉత్తరం పరిధిలో చిన్నదే అయినా, అందులో ఈ లోకపు లవుకిక సంక్లిష్ట వ్యవహారాలన్నీ తేటతెల్లంగా వున్నాయి. మానవుడి ప్రమేయం లేకున్నా బాహ్యమైన బలవత్తరగతులు

అతడిమీద ఎన్ని సమస్యలు మోపుతాయో న్యాయవాదిగా నేను గ్రహించని సంగతులెన్నో! ఆ జాబుకళ్లు తెరిపించింది.

"తెలుసుగదా, మన ప్రపితామహులు ఆ శకంలో వందెకరాల మెట్ట భూమిని నిత్యకైంకర్యాల నిమిత్తం గుడిమాన్యంగా దానం చేశారని. ఆ శాసనం తూర్పువైపు గోడలో యిప్పటికీ వుంది. పద్మాపురం ప్రాజెక్టు పుణ్యమా అని ఆ భూమి సస్యశ్యామలమైంది ఇటీవలెనే. అర్చకస్వాము లనుభవిస్తున్న పురాతన అగ్రహారంలో కొంతమేర భూములు అన్యాక్రాంతమైనా వారి భుక్తికి లోటులేదు. కొత్తగా ఆయకట్టు పరిధిలోకి వచ్చిన భూముల్ని చూడగానే సర్కారు వారి కన్నుకుట్టింది. ఈ ఆలయాన్ని దేవాలయ శాఖకు, జాయింటు వంశపారంపర్య ధర్మకర్తలం మనం అధీనం చేయాలని నోటీసులు వచ్చాయి. నీకూ అందివుండాలి. గత వైభవాల్ని తలచుకొన్న ప్రయోజనం లేదు. ధాతకరువు రోజుల్లో తమ ధాన్యాగారాల్ని తెరిచి పేదల్ని ఆదుకొన్న ఆ మహాత్ములు, దేవుడి తోటలో ఒక్క పుష్పాల్ని గూడా ముట్టుకోని మహితాత్ములు ముస్లిం దండయాత్రీకులు, పిండారీలు దోచుకొన్న నగలను తిరిగి చేయించటమేనా, పనులు కల్పించటానికి రాజగోపుర పునర్నిర్మాణం, ధ్వజ స్థంబానికి ఇత్తడి తొడుగులు, ప్రహరీ గోడకు పటిష్టమైన మరామత్తులు చేయించిన ఆ దానకర్ణుల మాట-ఈనాడు ఎవరు తలచుకొంటారు? వారికి కావలసింది దేవుని స్థిర చరాస్తులు. శిష్టాచారులైన పాతతరం వృద్ధాచార్యులు మంచాన పడ్డారు. స్నేహ పాపంచేత చెడిన, వారి సుపుత్రుడు నా సంతకాన్ని గూడా ఫోర్జరీ చేస్తున్నట్లు వినికిడి. దుష్టరాజకీయాలు కమ్ముకొస్తున్న ఈ రోజుల్లో ప్రభుత్వజోక్యం సబబే ననిపిస్తుంది. అయితే ఒకేఒక చింతన. మీ నాన్నా నేనూ సేలం జైలులో సంకటి ముద్దల 'సీ' క్లాసు ఖైదీలుగా వున్నప్పుడు మా హోదాకు తగినట్లు ఏ క్లాసు 'బీ' క్లాసు సౌకర్యాలు అడగలేదు. కాని దేవాదాయ స్పెషలాఫీసరు గారికి మీ 'కణ్వసభవనం' కావాలిట. ఆలయ ప్రాంగణంలో విశాలమైన గదులు పనికిరావట. స్వామి బంగారు ఆభరణాల్లో ముఖ్యమైనవి. మన ప్రపితామహిద్వయం చేయించిన ఆనాటి బంగరు పంచామృతాల పాత్రలు, యింకేవేవో మీమేడభోషాణంలో భద్రంగా వున్నాయి. నిధిని రక్షిస్తున్న నాగుపాములాగా మీ కుటుంబ సేవాధర్మి-వేంకటస్వామి ఎంతవత్తిడి వచ్చినా వాటి నెవరికీ చూపడు. ఇందుకోసం కాకపోయినా దశాబ్దాలు దాటుతున్నా నీ విక్కడికి రాలేదుగదా. ఎదురుచూస్తాను".

రెండవజాబు, దేవాదాయ శాఖవారి నోటీసులు. వెంటనే తంతివార్తలు పంపటమూ జరిగింది.

❖ ❖ ❖

ఈ ప్రయాణం - ఇంకొక తరుణంలో, విభిన్న పరిస్థితుల్లో అయితే, ఎంత ఆహ్లాదకరంగా వుండేదో దాదాపు నాలుగొందల మైళ్లు. నా కారువేగం ఒకటే నన్ను నడిపిస్తున్న శక్తి. నగర పొలిమేరలు దాటగానే ఒక శాంతి ధామంలో అడుగులు వేస్తున్నట్లు అనుభూతి కలిగినా, ఈ నిశిరేయి పరుగులో గ్రామీణశోభను దర్శించేదెక్కడ? అయినా రైలుగేట్లు అధిగమించి కాలవల ఒడ్డునే సమాంతర రోడ్లమీద పోతున్నప్పుడు, క్రిష్ణానది వారధిని చేరినప్పుడు-వేదాల్లో నదీసూక్తాలు, పచ్చని చెట్లను దాటుతున్నప్పుడు వేదరుషులు వల్లించిన ఔషధ వనస్పతులకు శాంతిసూక్తాలు-ఏ లోయినుండో పయనించి వస్తున్నట్లనిపించింది.

గ్రామ పొలిమేరల్లోకి ప్రవేశించే సరికి-అప్పటివరకూ శుభశకునంగా తోడునడిచిన వేగుజుక్క వెలవెలపోతూ కన్పించింది. అల్లంత దూరాన బ్రహ్మాండమైన కరకట్టల్తో సంజీవరాయుడి తటాకం, మలుపుతిరగ్గానే ఏ పర్వదినానో కదిలే చెన్నకేశవుడి రథపు చావిడి. ప్రహరీగోడలపై నుండి నిశ్చలంగా తలెత్తివున్న ధ్వజస్థంభం! ఈ ధ్వజమేగదా ప్రస్తుత పయనానికి మూలం. మలిమలుపులోనే మా "కణ్వసభవనం". కొత్తగా వెల్లవేయించినట్లుగానే వున్నది. అదొక దివ్యమంగళ దర్శనం.

నా తంతి సకాలంలోనే అందింది. గేటుముందు చిన్న హారన్ కొట్టకుండానే వెంకటస్వామి హాజరు. వేణ్ణీళ్ళు తయారుగా వున్నాయ్. మేడమీదనే స్నానం చేశాను. కింద రెండు మూడు గదుల్లో ఎన్నేళ్లనుంచో నివశిస్తున్న గ్రామ పాఠశాల ఉపాధ్యాయుడు సోమయాజులుగారంపిన వేడివేడి కాఫీ. ఒళ్లు తెలియక అట్లాగే నిద్రించాను. సాయం సంధ్యలో స్వామిదర్శనం అని భావించాను. సావకాశంగా సీతారాం అన్నయ్యతో మాట్లాడవచ్చుననుకొన్నాను.

నిద్రలేచి ముఖప్రక్షాళనంలో వుండగా వెంకటస్వామి కబురు - పాతతరం గ్రామస్తులెవరో నన్ను చూచేందుకు వచ్చారట. మెట్లు దిగుతుండగా అవమానిత దుఃఖదేవతవలె, ఎక్కలేని ఆయాసంతో బృందావనాచార్యులుగారు. ఊర్ధ్వపుండ్రాలు, చేతిలో పులిహోర పాత్ర తప్పితే-చిక్కిశల్యమైన ఆకారం. పొదివిపట్టుకొని నడిపించగా పైకి రాగలిగారు.

"బాబూ, వచ్చావా? త్రేతాయుగం గడిచింది. ద్వాపరం జారిపోయింది, కలిపాదాల భూమి యిది. మీమూడు తరాలవారు నాకు తెలుసు. జీవితం ధన్యమైంది ఇక శ్రీ చెన్నకేశవులు ఏ క్షణాన పిలిస్తే తక్షణం ఆచార్య తిరువడికి ప్రయాణంకడతాను. కాని ఒక్క మనవి. నా ఏకైక పుత్రుడు పెడదారిని పడ్డాడు. కుతర్కపండితుడైనాడు.

ఉత్సవ మూర్తుల చౌర్యానికి గూడా తలపడిన పాపి. వాడిని క్షమించండి-అంతకన్నా ఎక్కువ కోరను".

సంధ్యాపూజలో మా గోత్ర నామాలతో అష్టోత్తర శతనామావళి ముగించారు స్వయంగా. దీవించారు. నేను స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి వూరు చూచేందుకు బయలుదేరుతుండగా గోపురం కింద అప్రయత్నంగా నాలో నేను మాట్లాడుకొంటున్నాను. హే చెన్నకేశవా? కాలపుస్తకంలో ఐతిహాసిక వాణి మొదటి సంతకం చేసింది-ఇక రెండో సంతకానికీ ఎక్కువ గడువులేదుగదా! అవును, ఆఖరి పూజ గదా!

ఊరు విస్తరించి సంకీర్ణమై పట్నం సొగసులు దిద్దుకొంటున్నది. సీతారాంగారి యింటివేపు పురా అనుభవంతో మలుపు తిరిగాను. అక్కడా విశాల భవనం ఏదీ? నాకు స్మృతి వున్నంతవరకూ కలయజూశాను. ఒకనాటి ప్రాభవ అవశేషంగా అక్కడొక టెంటు సినిమాహాలు దర్శనమిచ్చింది. ఎవరో అంటున్నారు. "ఆయనుండేది వూరిబయట యానాదిగూడెంలో కదా!" టెంటు హాలు ముందు డప్పుల మోతమధ్య పాత చిత్రాల్లోని డ్యూయెట్ పాటలు. నన్ను వెతుక్కుంటూ వచ్చిన వెంకటస్వామిని చూచి తప్పుకొన్న యువకుడు. "ఆచార్లు గారి కొడుకయ్యా!"

❖ ❖ ❖

ఇల్లుచేరేసరికి మెట్లమీదకే ఏదో సన్నని సువాసన వస్తోంది. లైటుముందు నేను తెచ్చిన ఆంగ్ల నవలను తిరగేస్తూ సీతారాం అన్నయ్య-ఎదురుగా బల్లమీద చిన్న తాటాకుల బుట్టలో పాల సపోటాలు. విస్మృత కథకుడా? హిమాలయపు ఒంటరి లోయల్లో వెన్నెల పరుస్తున్న విషాదచంద్రుడిలాగా తోస్తున్నాడు. ఏ రహస్య నదీతీరానో ఉదయ భాస్కరుడికి అర్ఘ్యమిచ్చి ఆదిత్యహృదయం పఠిస్తున్న యోగాభ్యాసపరుడిగా గోచరిస్తున్నాడు. టెంటు సినిమాహాలు చికాకు మాయమైపోయింది-ఆ దృశ్యం ముందు. పొందూరు ఖాదీ లాల్చీ, చలవచేసిన ధోవతి, యౌవనమో వృద్ధాప్యమో తెలియనీయని కాయపారు శరీరపు బంగారు ఛాయ, అయినా అలసటకమ్ముకొన్న కళ్లు. నా కాయన వృద్ధుడుగా తోచలేదు. సీతారాంగారు గొప్ప స్ఫురద్రూపి. ఏ స్త్రీ అయినా ఆకర్షణా తరంగాల వూపుతో ఆయన యౌవన ప్రాయంలో మోహస్పందన జలపాతంలో తడిసిపోయి వుండదా అనిపించింది.

పాదాభివందనం చేస్తుంటే వారించి, నా భుజాలనెత్తి కౌగలించుకుంటూ - "నీకు చాలా ఇష్టమని ఎప్పుడో అన్న మాటను గుర్తుపెట్టుకొని కల్యాణి పాలసపోటాలు పంపింది" అని కళ్లతోనే నవ్వాడు.

"కల్యాణా?"

"యానాది సేవా సమితి కార్యదర్శి. నేనూ, చంద్రికా పెంచిన పాప."

చంద్రిక!

❖ ❖ ❖

సీతారాంగారిది మా వూరుకాదు. పెత్తల్లికి దత్తతవచ్చినవాడు. సంపన్నగృహస్థులు. నిజానికి మాప్రాంతానికంతా పెద్ద మిరాశీదార్ల కుటుంబం. కవి పండిత సన్మానాలు దసరా నవరాత్రి మహోత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహించే సంస్కారము. పెంపుడు తండ్రి, శతకగ్రంథకర్త. దేశభక్తుడు. రాయని భాస్కరుల దానధర్మాలతో స్వాతంత్ర్య ఉద్యమ కార్యకలాపాల్లో అప్పటికే చాలా ఆస్తి కర్పూర హారతి తర్వాత పళ్లెమైంది. సీతారాంగారు కాలేజీ దశలోనే అతివాద రాజకీయాల్లో జోక్యం ఉన్నవాడు. ఎన్నో కథలు. వంగదేశంలో ఆనాటి విప్లవవాదుల 'అనుశీలన సమితి'ని ఆంధ్రదేశంలో పునరుద్ధరించాలని కంకణం కట్టుకొన్నట్లు చెప్పుకొనేవారు. ఒక ఏడాది పాటు అజ్ఞాతంగా బెంగాల్‌లో తిరిగి బాంబులు తయారుచేయటం నేర్చాడనిగూడా వదంతి. వారం వారం పోలీసులరాక, నిఘా. వాళ్ల నాన్నగారికెందుకో అతణ్ణి బారిష్టర్ చేయాలని మక్కువ. అయితే సీతారాంగారు లండన్ వెళ్ళలేదు. అప్పటికి డీవెలరా నాయకత్వంలోని ఐర్లాండు రాజధాని డబ్లిన్‌కు పయనం. డీవెలరా బ్రిటిష్ శత్రువు గదా. కాని ఏకారణంచేతనో ఒక సంవత్సరానికే డబ్లిన్ నుంచి తిరిగి వచ్చాడు. జనశ్రుతి వదంతుల్ని నమ్మితే అక్కడొక ఐరిష్ యువతిని ప్రేమించాడనీ, సముద్రంలో ఈదుతూ ఆమె మరణించిందనీ తను భగ్నప్రేమికుడై తిరిగి వచ్చాడనీ. సత్యాసత్యాలెవరికీ తెలియవు. ఆ తర్వాత ఒకటి రెండేళ్లు జాతీయ కళాశాలలో అధ్యాపకవృత్తి. ఇంతలో గాంధీజీ సత్యాగ్రహ సమరం. మానాన్నగారితో సేలం జైలులో రమారమి మూడేళ్ల కఠిన శిక్ష. కారాగారవాసం అతన్ని సంపూర్ణ పరివర్తన చేసిందని నాన్నగారంటుండగా విన్నాను. ఎన్నో యోగాభ్యాసాలు, ఆసనాల నిబంధనలతో సన్నగా, రివటగా మిలమిలలాడే శరీర కాంతితో బయటకు రావటం ఒక అద్భుత చర్య. గీతా శ్లోకాలను అనర్గళంగా వల్లించేవాడు.

అప్పటికి పెంపుడు జననీ జనకులిద్దరూ కాలధర్మం చెందటం, ఇంటి వ్యవహారాలు చక్కదిద్దుకొనే ప్రయత్నంలో కొన్నేళ్లు. చక్కదిద్దుకొనేందుకు మిగిలింది దాదాపు శూన్యం. స్వార్థపరులైన కొందరు పెద్ద భూస్వాముల్తో కొన్ని చికాకులూ పడ్డారు. మనశ్శాంతి కోసమే కాబోలు వినోబాభావే ఆశ్రమానికి హఠాత్తుగా తరలిపోయాడు. చంబల్ నదీలోయ ప్రాంతంలో వినోబాజీ బందిపోటు దొంగల్ని సంస్కరించే ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడని గూడా విన్నాను. కొన్ని సాహసకృత్యాలూ చేశాడని

చెప్పుకొన్నారు. ముఖ్యంగా అందరూ చెప్పుకొన్నది-గ్వాలియర్ నగరానికి వందమైళ్ల దూరం అడవుల్లోకి బందిపోట్లు అపహరించుకుపోయిన పెళ్లి బస్సును వెంటాడి, ఎవరికీ హానిజరగకుండా స్త్రీల ఆభరణాలతో సహా రక్షించాడని. కొందరు దొంగల్ని వినోబా ముందుకు తెచ్చి అస్త్రసన్యాసం చేయించాడని. అమోఘమైన హిందీ వాక్చాతుర్యంకలవాడు. సంస్కృతం సరేసరి. ఏక సంతగ్రాహి. బహుశః వినోబాజీ ప్రేరణ తోనే కావచ్చు. తన స్వగ్రామ పరిసరాల్లో అశేషంగా వున్న - యానాదులనబడే అనాది ఆదివాసుల సేవకు అంకితమైనాడు. అప్పటి కాయనకు శేషభుక్తంగా వున్న ఆస్తి రెండెకరాల మాగాణి భూమి. దేవాలయ ధర్మకర్తృత్వం ఆయనమటుకు నామమాత్రమే. తన పెద్దల ధర్మాన్నే అనుసరించిన ఆదర్శమూర్తిగా నిలిచాడు.

సంఘ బహిష్కృతులు కాకపోయినా, జన తిరస్కృతులుగా పరిచ్యుతులుగా బ్రతుకు వెళ్లదీసే యానాదులనందర్నీ సమీకరించాడు. చిల్లర మల్లర దొంగతనాలకు అలవడిన వాళ్లను గూడా సంస్కరించాడు. ఆత్మగౌరవం నేర్పాడు. గాంధీ వాదిగా గ్రామీణ పరిశ్రమల్లో-ముఖ్యంగా తేనెపట్టులు పెంచటం, బుట్టలు తట్టలు అల్లి అమ్మించటం, కూరనారలు పండించటం - వాళ్లకు తర్ఫీదు నిచ్చాడు. యానాది బాలబాలకల ఆశ్రమ పాఠశాల నెలకొల్పి కొత్త దీపాలు వెలిగించాడు. అయినా ఏదో అసంతృప్తితో, నిత్యశంకితుడుగా వేరేదో పరమగమ్యాన్ని గవేక్షిస్తున్న నైష్ఠికుడుగా, సముద్ర దిశకానక పరిగిడుతున్న నదీప్రవాహంలాగా తోచేవాడు. మకుటాయమానమైన ఒక చర్యగా, యానాదుల యక్షగాన భాగవత పునరుద్ధరణను చేపట్టాడు. గతస్మృతిగా వున్న ఉషాపరిణయయక్షగాన నాటకాన్ని తరిఫీదు చేయించాడు. యానాదుల్లో పరంపరగా వస్తున్న నలచరిత్ర నాటకం, ప్రభావతీ ప్రద్యుమ్న్యం తిరిగి జీవం పోసుకొన్నాయి. దసరా నవరాత్రుల్లో ప్రదర్శించటానికి ఎన్ని తిప్పలు పడ్డాడో- ఆ వివరాలన్నీ నాకంతగా తెలియవు. అప్పుడు, ఓం ప్రథమంగా, ఒక అపురూప సౌందర్యవతి, ఒక యానాది యువతి బాణాసురపుత్రి ఉషాకన్యగా మా గ్రామ యక్షగాన వేదికమీద కన్పించింది. ఆమే చంద్రిక! శ్యామల వర్ణమైనా ద్రుపదరాజ తనయ అందం.

ప్రతి కదలికలో ఒక కులీన వంశపు సౌందర్యరాశిగా, ప్రతిపాటలో తన జీవితపు చిరమర్మవేదనలకు గాత్ర స్వరూపమిస్తున్న గాంధర్వ కన్యగా గోచరించేది. ఆ పాటల గమకాలుకొన్ని ఇప్పటికీ నాకు జ్ఞాపకమున్నాయి. గొప్ప అందానికి చామనచాయ చర్మం అడ్డురాదని చంద్రికను చూచిందర్వాత నేను గ్రహించాను. అప్పటికి నేను యువకుణ్ణి. ఊళ్లో మదాంధులైన భూస్వామ్య పుత్రులమాటలు కర్ణాకర్ణిగా వింటున్నాను. ఈ దుశ్శాసనుల పీడనుండి చంద్రికను నిరాయుధులు అమాయకులైన యానాదులు

రక్షించుకోగలరా అని ఎందుకనుకొన్నానో, ఆర్నెల్లతర్వాత లా కాలేజీ సెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు, ఒక ఘోర ఉదంతం విన్నాను. ఒక దుష్టుడు ఆమెను మానభంగం చేశాడనీ మూడు రోజులతర్వాత వాడి శవం సంజీవరాయుడి చెరువులో తేలిందని. ఆరాత్రి మాయింటికి బంధువులెందరో వచ్చివున్నారు-మా నాన్నగారి ప్రథమ సంవత్సరీకాలకు. హడావిడిగా అర్ధరాత్రి సీతారాంవచ్చాడు-"ఇది నీ గదిలో భద్రంగా దాచు" అని ఒక చిన్న సంచీ యిచ్చి పోయాడు అంత తొందరలోనే. హతుడి ఒడలిమీద గాయాలేమీలేవుట.

కాని శరీరం అంతర్భాగంలో విపరీత రక్తస్రావం కనపడ్డదట. మా బంధువులందరూ నిర్గమించిన మరుసటి దినాన ఉబుసుపోక సీతారాంగారి సంచీ తెరిచాను. ఒక తెల్లటి గుడ్డలో కప్పివున్న పిస్తోలొకటి కంటబడ్డది. "మేడ్ ఇన్ రిపబ్లిక్ ఆఫ్ ఐర్"! అప్పటికే పోలీసులు రావటం పోవటం జరిగింది. గ్రామంలో గుసగుసలేమీ వినబడలేదు. నేను తిరిగి కాలేజీకి బయలుదేరుతున్న రాత్రి సీతారాం ఆ సంచీని తీసుకువెళ్ళిపోయారు. మరు సంవత్సరం వెంకటస్వామి పట్నం వచ్చినప్పుడు ఒక సమాచారం చెప్పినప్పుడు-నేను ఆశ్చర్యపోలేదు. సీతారాంగారు చంద్రికను యానాదుల సాంప్రదాయం ప్రకారం, ఒక మిట్ట మధ్యాహ్నం రోకలిని భూమిలోపాతి దాని నీడ హరించిపోయినపుడు శుభముహూర్తంలో పెళ్లాడారని.

సినిమా రీళ్ళ త్వరిత చలనం లాగా ఈ దృశ్యాలూ సంఘటనలూ నా మనోక్షేత్రంలో కదిలాడినాయి-ఆయన చెబుతున్న మాటలు ఎక్కువ రిజిష్టర్ కాలేకపోతున్నాయి. ఇంతలో సోమయాజులుగారు భోజనం పైకే పంపారు. నేనూ అన్నయ్యా భోంచేశాం. ఎల్లుండికి గాని దేవాదాయ శాఖాధికారులు యిక్కడకు చేరరట-ఆచార్లు గారంపిన వార్త.

❖ ❖ ❖

ఎల్లుట పదిగంటలవుతూన్న ఉదయంలో డిప్టీ కమీషనరూ, బిళ్ల బంట్రోతూ, ఒక చప్రాసీ కాబోయే అసిస్టెంటు కమీషనరూ జీపులో దిగారు. డిప్టీకమీషనర్ గారి నోట్లో స్పెన్సర్ చుట్ట పొగ. నేను దిగ్భ్రమ చెందాను. వీళ్లా అధికారులు? ప్రభుత్వం? ఒక చరిత్రాత్మకమైన పురాతన దేవాలయాన్ని స్వాధీనం చేసుకోబోతున్నది-ఆ కళ్లల్లో ఏ విషయ పరిజ్ఞానమూ గోచరించని వీళ్ళా! వినమ్రత చారిత్రక దృష్టి కనబడదే- ఆ ఎర్ర జీరల నేత్రాల్లో! వీళ్లు దేవదూతలు కారు. కమీషన్లు గుణించుకొంటున్న అల్పులు. అసురులు.

కర్ణంగారు, ఇన్నేళ్లుగా స్వామికార్యాన్ని ఏ ప్రతిఫలమూ ఆశించకుండా భూ ఆదాయ వ్యయాల్ని చిట్టాలలో భద్రపరచిన రంగయ్య గుప్తా. సీతారాం గారితో పైకి వచ్చారు. కర్ణంగారు అడంగులూ సర్వే మ్యాపులు తీసి చూపి దేవుడి స్థిరాస్తి వివరాలన్నీ సమర్పించారు. రంగయ్య గుప్త చిట్టాలన్నీ ముందు పడేశాడు. అణా పైసల్తో ఖచ్చితంగా వున్న లెక్కల్ని చూసే ఓపిక వారికి లేదు.

'ఈ భవనం మాటేమిటి?" అన్నారు నన్ను చూస్తూ కమీషనర్ గారూ, వారి అసిస్టెంటు.

"ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ భవనం మీకు దక్కదు. ఆశను పెంచుకోకండి నేను లాయర్ని. మీ నోటీసులో అవకతవకలన్నీ నాకు అవగతం. ఆలయ ప్రాంగణం విశాలమైనది - మీకు కావలసినంత. మీ కార్యాలయాలు అక్కడ నిరభ్యంతరంగా కొనసాగుతాయి"

ఆయన గుడ్లు మిణకరించి చూచి ఏమనుకొన్నాడో ఏమో- "మరొకసారి ఆలోచించండి. తొందరలేదు. ఈ భూముల్ని చూచుకొని మళ్ళారేపు వస్తాం. చరాస్తులు, ఆభరణాలు, వస్తువాహనాల పట్టీ తయారుచేసివుంచండి. త్వరలో ముగిద్దాం" అంటూ లేచి నిలబడ్డారు. సీతారాంగారేమీ మాట్లాడలేదు. వెంకటస్వామి అమర్చిన స్వల్ప ఆతిధ్యం స్వీకరించి ఆ బృందం వెళ్ళిపోయింది.

ఆ రాత్రి సోమయాజులు గారి సాయంతో ఆభరణాల పట్టీ తయారైనది. మా భోషాణంలో వున్న ఆ నగల్ని, హేమ పాత్రల్నీ నేనిదివరకంత పరిశీలనగా చూచి వుండలేదు. హేమ పాత్రలమీద మా మాతామహిద్వయంపేర్లున్నాయి. సీతారాంగారు కూడా ఆశ్చర్యంగా చూచి భక్తిభావంతో కళ్లుమూసుకొన్నారు. కిరీటాలు, హస్తాభరణాలు, వెండి త్రిపుండ్రాలు, భుజకీర్తులు, కర్ణాభరణాల జతలు, పంచామృత పాత్రలూ అన్నీ లెక్కిస్తే రెండు వందల దాకా తేలాయి.

కింద దేవాలయం పనివాళ్ళు వేచివున్నారు. చోపుదార్లు, పల్లకి వాహకులు, దివిటీల వాళ్లు, దైనందిన నైవేద్యపరిచాలకుడు గోవర్ధనాచార్యులూ. వారందర్నీ పలకరించి ధైర్యం చెప్పి పైకి వచ్చేసరికి - ఆభరణాలను సర్దుతున్న వెంకటస్వామి 'ఒక బంగారం పాత్ర కనిపించదయ్యా, నాలుగేవున్నాయి" అన్నాడు కంగారుగా. మళ్లీ శోధించాం. కన్పించలేదు. చెన్నకేశవా, ఏమిటీ భౌతిక ఆధ్యాత్మిక కల్లోలం తెచ్చిపెట్టావ్, ఈ దశలో.

ఆ రాత్రి నాకు భోజనం సహించలేదు. ఎవరిదీ చౌర్య హస్తం? ఒకసారి సింహావలోకనం చేసుకొన్నాను. సోమయాజులుగారు ఒక్క వస్తువూ ముట్టలేదు.

దూరంగా టేబిల్ ముందు కూర్చొని మేము చెప్తున్న పట్టీని వ్రాసుకొంటూ పోయారు. వెంకటస్వామిని అనుమానించటం ఘోరపాపం. సోమయాజులు గారు మామ్ముందే వెళ్ళిపోయారు. మిగిలింది - నేనూ సీతారాంగారూ. చివరకు నిర్గమించింది ఆయనే. చేతిలో సంచీగూడా వుంది. పరిపరివిధాల మనసు పరుగెత్తుతున్నది. ఈ ఆఖరిక్షణాల్లో - తన దరిద్రావస్థలో ఈ పనికి పాల్పడ్డాడా? ఒక పాత్రతో అదురవస్థ తీరుతుందా? ఏమో పేదరికం ఎంత నికృష్టానికైనా పాల్పడుతుందిగదా. రేపు ఆచార్లుగారి సమక్షంలో ఏ సమాధానం చెప్పాలి? అనాలోచితులైన అధికార్ల దృష్టిలో ఎంతపల్చబడిపోతాం? మళ్ళీ అటువంటి పాత్రను చేయించటం నాకొక సమస్యగాదు. గతించిన మాతామహికి ఎంత అపచారం? కలతనిద్రలో ఒక స్వప్న దృశ్యం. సీతారాం అన్నయ్య-గీతా రహస్యం ఒంటపట్టిన వ్యక్తి అనుకొంటున్న నాకు - బంగరు పాత్రను సంగ్రహించి సంచీలో వేసుకొంటున్నాడు రహస్యంగా. ఛీ..ఛీ... మానవత్వం మీద ఇన్ని నమ్మకాలు పెట్టుకొనటం నా బలహీనత. రేపు ముఖమెట్లాచూపగలడు? ఛీ! నేననుమానించిన హత్యకు అతనే బాధ్యుడు. ముమ్మాటికీ మనిషిని చంపగలిగిన వాడు చిన్న దొంగతనం చేయలేడా?

❖ ❖ ❖

ఊహించినట్లే సీతారాంగారు మర్నాడు రాలేదు. దేవాదాయ శాఖవారూ రాలేదు. అశాంతితో కుశంకలతో అవమాన భారంతో రోజంతా గడచింది. ఆచార్లుగారు ఫలహారాలు పంపారు. ముట్టలేకపోయాను.

చీకటి పడ్తుండగా ఒక యానాది యువకుడు సీతారాంగారి చీటీ తెచ్చియిచ్చాడు - "మా ఆశ్రమానికి రా. ఇవ్వాళ చంద్రిక సప్తతి ఉత్సవం". ఛీ. ఏముఖం పెట్టుకొని? ఏమని మాట్లాడేందుకు? అయినా అతనితో బయలుదేరాను. వెంకటస్వామికీ చెప్పలేదు.

యానాది సేవాశ్రమం గ్రామం వెలుపల మైలు లోపు దూరంలో ఏకాంతంగా వున్నది. ఆవరణలో కొబ్బరాకులమీద సన్నని నక్షత్రకాంతి కన్పిస్తున్నది. దైన్య దేవత నిలయంగా ఆ పరిసరాలు. ఇంకేమీ కనబడలేదు. యానాది మనిషి కొబ్బరాకుల తడికెను తొలగించి లోనికి పొమ్మన్నాడు. సన్ననిదీపం వెలుగుకు కళ్ళు అలవడిపడుతున్నై కాని ఏదో మాగిన పండ్ల ముక్క వాసన ముక్కుపుటాలను అదరగొడ్తున్నది. నన్ను చూచి హరికేన్ లాంతర్ను ఇంకొంచెం ముందుకు జరిపారు. హఠాత్తుగా నా అడుగులు స్తంభించిపోయినై. అదొక భయానక దృశ్యం.

ఒక పాతమంచం మీద చంద్రిక. సింహం పోలికతో ఆమె ఒక నాటి చంద్రబింబం వంటి ముఖం. ముక్కును గూడా సగం తినేసిన ఘోరమైన కుష్టువ్యాధి. గొంతు బొంగురుగా ఏదో పాడుతున్నది. పక్కనే స్టూలు బల్లమీద కూర్చొని సీతారాంగారు

ఆమెకు పాయసం తినిపిస్తున్నారు. ఆ పాత్ర-కనపడకుండా పోయిన బంగారు పంచామృతపాత్ర.

ఆమె నాకు ఓపికతో నమస్కారం చేయబోయింది.-ఆ చేతులకు వేళ్లు లేవు. దుర్గంధం ఆగదు.

"రా, కూచో. ఇవ్వాళ తన సప్తతి. దేవుని పాత్రలో ప్రసాదం తినాలని వుందన్నది. గోల్డెన్ టార్చితో నా రోజుల్ని వెలిగించింది. జీవితం ధన్యమైందని కొద్ది క్షణాలక్రితం అన్నది" అంటున్నారు సీతారాం.

నేనట్లాగే ఇంకో స్టూలుమీద కూలబడ్డాను.

కళంకభరంగాని ఒక ప్రణయగాధ ముగింపుఘట్టం పైన ఏవో మృత్యుపక్షుల రెక్కల చప్పుడు విన్పించినట్లయింది. కను రెప్పల చప్పుడు గూడా వినవచ్చే నిశ్శబ్దం. తడికెమీది బల్లి పురుగుల వేట మాని నిశ్చలంగా వుంది. అవైపు మేజామీది అలారపు గడియారం ఆగిపోయి వుంది. ఆవరణలో చంద్రిక పెంచిన కుక్క శోకరాగాన్ని నిలిపివేసింది. కొబ్బరిచెట్ల ఆకులు కదులుతున్నట్లు లేవు.కల్యాణి అగరుబత్తీల ధూపం వెలిగించింది. క్రమంగా దుర్వాసన మందగిస్తున్నది. తండ్రి చేతిలో పాత్రను కల్యాణి అందుకొంటున్నది. ఆయన ఒకనాటి చంద్రిక విశాల నేత్రాలమీద దుప్పటికప్పాడు. చావు బ్రతుకుల విభజనరేఖ నాకగుపించలేదు.

ఒక మనిషి మౌనమై, గీతాధ్యానమై, మహాయోగమై, మహిమాన్వితుడైన ఆ దివ్యక్షణాన సీతారాంగారికి ఈసారి మళ్ళీ పాదాభివందనం చేశాను.

మరునాడు కణ్యసభవన ప్రాంగణంలో చంద్రిక సమాధి అవుతుండగా, దేవాదాయ శాఖవారు విచ్చేశారు. "ఈ భవనం, దీననుసరించుకొన్న భూములు, తోట యానాది సేవా సమితికి అంకితం చేస్తున్నాను. వీళ్లు ముగ్గురూ దాని ధర్మకర్తలు" అని వారితో చెప్పాను. ఐదవ పాత్రతో సహా అన్ని అభరణాలు వారికి అనాడే అప్పగించాను

❁ 'ఇండియా టుడే' - 2000 వార్షిక సంచిక

"ఎన్నేళ్లనుండి చూస్తున్నా నిన్నసలు చూశానా?
ఇన్నేళ్ళు వినిపించినా నీవిపంచిక విషాదరాగం
నాకసలు తెలిసివచ్చిందా?

-మునిపల్లె రాజు అరణ్యకాలనుండి